క్లుప్తంగా

'ఇబ్బంది కలిగిస్తే ఫిర్యాదు చేయండి'

నల్లగొండ: పట్టణ ప్రజలను వాహనదారులు ఇబ్బంది పెడితే 87126 67670 నంబర్‌కు ఫోన్ చేయాలని వన్‌టౌన్ పోలీస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీల్లో, చుట్టుపక్కల, రోడ్డుపై అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లతో వేగంగా ప్రమాదకర స్థితిలో డ్రైవింగ్ చేస్తున్నా వెంటనే ఫొటో తీయడంతో పాటు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయాలన్నారు.

నేడు గుండ్రాంపల్లికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాక

చిట్యాల: సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవంలో భాగంగా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పాల్గొననున్నారని చిట్యాల మండల బీజేపీ అధ్యక్షుడు పీక వెంకన్న, జిల్లా నాయకుడు చికిలంమెట్ల అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తెలంగాణ విమోచనలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మృతవీరుల కుటుంబాలకు సన్మానంతోపాటు అమరవీరుల స్తూప నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు.

హక్కులను సాధించుకోవాలి

మర్రిగూడ : కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పుల లింగస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీఐటీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా ఏర్పుల లింగస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఏర్పుల యాదయ్యలతోపాటు మరికొంతమందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నాయకులు సల్వోజు రామలింగాచారి, ఖాసీం, మల్లేష్, ఖాసీం, రమేష్, కొట్టం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


పుష్పలత తహసీల్దార్

కట్టంగూర్ : కట్టంగూర్ తహసీల్దార్‌గా ఏ.పుష్పలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ ల్యాండ్ ఎక్విజేషన్ నుంచి ఆమె కట్టంగూర్‌కు బదిలీపై వచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్(సీఐటీయూ) రాష్ట్ర కోశాధికారి కె.ఎస్.రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఆర్టీసీ రీజియన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017 పే స్కేల్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, 2021 కొత్త పీఆర్సీ ప్రకటించాలని కోరారు. రీజియన్ అధ్యక్షులు కందుల నరసింహ, కార్యదర్శి బత్తుల సుధాకర్, సహాయ కార్యదర్శి కల్లేపల్లి శ్యాం సుందర్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ వార్షికోత్సవం


వేడుకల్లో పాల్గొన్న మేనేజర్, సిబ్బంది

నల్లగొండ: పట్టణంలోని బ్రాంచ్ 1,2 ఎల్ఐసీ కార్యాలయాల్లో సోమవారం 69వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐడీబీఐ మేనేజర్ సత్యవల్లి బాబు, నల్లగొండ వన్ బ్రాంచ్ మేనేజర్ ఏ.వెంకటేశ్వరరెడ్డి జ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ యం.శ్రీనునాయక్, సిబ్బంది పుల్లెంల శ్యాంసుందర్ కుమార్, శర్వాణి, కరుణ, ఎం.శ్రీనివాసులు, పి.హర్షవర్ధన్, వి.వెంకటేశ్వర్లు, వి.గురుమూర్తి, యం.వి.రమణారెడ్డి, డి.రామారావు, కే.సురేష్, జే.బాలరాజు, సీహెచ్. విజయ్ కుమార్, కొప్పు వెంకన్న, వేముల కృష్ణయ్య, నలపరాజు సైదులు, దేవేందర్, దారం వెంకన్న, పుల్లెంల శ్రీనివాస్‌గౌడ్, యాదయ్య పాల్గొన్నారు.

మూసీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

నకిరేకల్ : పెద్దపెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న నకిరేకల్–మూసీ రోడ్డుకు ఆర్‌అండ్‌బీ అధికారులు సోమవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించేది ఎలా... అనే శీర్షికతో సోమవారం సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలను కంకరతో నింపి చదును చేసే పనులు ప్రారంభించారు.

విద్యార్థుల ప్రతిభ

రామగిరి(నల్లగొండ): ఆలిండియా మేథమెటిక్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి మేథమెటిక్స్ ఒలింపియాడ్ 2025 పోటీల్లో నల్లగొండ ఓక్‌ట్రీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు ఒలింపియాడ్‌కు ఎంపికయ్యారని పాఠశాల చైర్మన్ తుమ్మలపల్లి హనుమంత్‌రెడ్డి తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన


నార్కట్‌పల్లి : సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


నకిరేకల్ : రాస్తారోకోలో పాల్గొన్న నలగాటి ప్రసన్నరాజ్

నార్కట్‌పల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ సోమవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేసి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, చిరుమర్తి యాదయ్య, మాజీ సర్పంచ్‌లు మల్గ బాలకృష్ణ, కొత్త నర్సింహ, మహేశ్వరం సతీష్, అలుగుబెల్లి సత్తిరెడ్డి, మేక వెంకట్‌రెడ్డి, పాశం సత్తిరెడ్డి, నరేష్, జాని, పెరమల్ల రవి, నాగరాజు పాల్గొన్నారు.

నకిరేకల్ : కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్‌పై సీబీఐ కేసును నిరసిస్తూ నకిరేకల్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించి మెయిన్ సెంటర్‌లో ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నరాజ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ నడిపిస్తున్నాడని ఆరోపించారు. కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పజెప్పడాన్ని తక్షణమే విరమించుకోవాలని కోరారు. ఊట్కూరి ఏడుకొండలు, గుండాల మల్లేష్ గౌడ్, యాతాకుల సోమయ్య, చెరుకు వెంకటాద్రి, చౌగోని శంకర్, చింతమల్ల శ్రీను, మేకల రమేష్, కందాల శ్రీనివాస్‌రెడ్డి, యేసు, ఊట్కూరి నాగయ్య, తండు సోమయ్య, శివ, గోలి శివ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : ప్రజాస్వామాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీ చేస్తుందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరపాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని నిరసన ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీఘోష్ కమిషన్ నివేదికను తారుమారు చేశారన్నారు. సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మండల,మున్సిపల్ అధ్యక్షులు గి ర్కటి నిరంజన్, బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.


చౌటుప్పల్ : మాట్లాడుతున్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి


చెక్కు అందజేస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మునుగోడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 66 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు కల్యాణక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్‌తో పాటు సబ్సిడీ గ్యాస్ అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి, తహసీల్దార్ ఎస్.నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మాజీ సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, జాల వెంకన్న, పాల్వాయి చెన్నారెడ్డి, మాదగోని రాజేష్‌గౌడ్, ఆరేళ్ల సైదులు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం


కేతేపల్లి: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నకిరేకల్ : ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ నకిరేకల్‌లో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కస్మంతరెడ్డి శ్రీదేవి, బీజేపీ మండల అధ్యక్షుడు బుడిగె సైదులు, జిల్లా దాకయ్య, యానాల శ్రీనివాస్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న, కొండేటి శ్రీను, దొడ్డోని శంకర్, ఉప్పల నాగరాజు, వీరస్వామి, శేఖర్‌రెడ్డి, వేముల విజయ్, యాదయ్య, పెద్దులు, నవీన్, సాయి, శ్రీను, రామకృష్ణ, నర్సింహారెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

కేతేపల్లి: ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కేతేపల్లిలో బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్, అయితగోని అనిత, తాడోజు నర్సింహాచారి, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, సమ్మెట విజయలక్ష్మి, అఖిల్, పోకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు


తిప్పర్తి మండల కేంద్రంలో యూరియా కోసం గుమికూడిన రైతులు


కట్టంగూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

తిప్పర్తి : యూరియా కోసం రైతులు తిప్పర్తి మండల కేంద్రంలో సోమవారం బారులుదీరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రతి రైతుకు ఒకటి,లేదా రెండు బస్తాల యూరియా ఇస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

శాలిగౌరారం: మండలంలోని యూరియా కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆగ్రో రైతుసేవా కేంద్రానికి 10 టన్నులు (222 బస్తాలు) యూరియా రావడంతో సోమవారం తెల్లవారుజాము నుంచే సుమారు 350 మంది రైతులు యూరియా కోసం క్యూలైన్ కట్టారు. మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి సిబ్బందితో ఉదయం 7.30 గంటలకే అగ్రో రైతుసేవా కేంద్రానికి చేరుకుని అధికంగా ఒక్కో రైతుకు ఒక్కో బస్తా యూరియా అందించారు. యూరియా కోసం రశీదులు రాసే క్రమంలో రైతులు ఎగబడడంతో తోపులాట జరిగింది. పరిస్థితిని గమనించిన ఏఓ ఆగ్రో సేవా కేంద్రం వద్ద కాకుండా సమీపంలోని ఓ ఎరువుల దుకాణం వద్ద యూరియా బిల్లు రశీదులను జారీచేశారు. 222 మంది రైతులకే యూరియా లోడ్ అయిపోవడంలో అనేక మంది నిరాశతో వెనుదిరిగిపోయారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు సోమవారం 222 బస్తాల యూరియా వచ్చింది. సమాచారం తెలుసుకున్న రైతులు ఎక్కువ సంఖ్యలో రావటంలో పోలీసులు క్యూలో నిలబెట్టారు. దీంతో పీఏసీఎస్ సిబ్బంది రైతుకు ఒక్క బస్తా చొప్పున పంపిణీ చేశారు. యూరియా దొరకని సుమారు వంది మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

నకిరేకల్ : గ్రామ స్వరాజ్యం పథకం కింద బాబాసాహెబ్‌గూడెంలో ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితప్రారంభించారు. మహిళలకు కొత్త కుట్టు మిషన్లు అందజేశారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


శాలిగౌరారం: నిరసన తెలుపుతున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, సిబ్బంది

రామగిరి(నల్లగొండ): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్జీ కళాశాల అధ్యాపకులు సోమవారం కళాశాల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.అనిల్ కుమార్, డా.మునిస్వామి, బి.నాగరాజు, డా.శ్రీధర్, శివరాణి, కోటయ్య, సీహెచ్.సుధాకర్, శ్యాం సుందర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవరావు, ఫరంగి, స్వరూపరాణి, గిరి వెంకటయ్య, మంజులత, కొండ శ్రీనివాస్, వెంకట్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

నకిరేకల్ : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ నకిరేకల్ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఉపాధ్యాయులు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు తాటిపాముల నర్సింహమూర్తి, కే.శ్రీనివాస్, లింగాల నగేష్, విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది నిరసన

శాలిగౌరారం: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా


నల్లగొండ టూటౌన్: ధర్నా చేస్తున్న నాయకులు


గట్టుప్పల్ : వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్: మున్సిపాలిటీలోని వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్‌హాశం, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, ఊట్కూరి నారాయణరెడ్డి, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి,, అవుట రవీందర్, దండంపల్లి సరోజ పాల్గొన్నారు.

తిప్పర్తి : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మన్నెం భిక్షం, రాములు, ఆకిటి లింగయ్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కేతేపల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దు మారయ్య, ఎల్.రాజు, కోట లింగయ్య, కక్ర బాలయ్య, భాగ్యమ్మ, గాదె సత్తిరెడ్డి, అయ్యన్న, నీలం సైదులు, ఎల్లయ్య, విజయ్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీ ఆల్‌బర్ట్ ఫ్రాంక్లిన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గంజి మురళీధర్, సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, రామస్వామి, సుధాకర్, రెడ్డిమల్ల భిక్షం, చిలుముల కృష్ణయ్య, ఊట్కూరి శ్రీను, అంతిరెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

గట్టుప్పల్ : గ్రామాల్లో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం ఆధ్వర్యంలో సోమవారం గట్టుప్పల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి, ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, చాపల మారయ్య, కర్నాటి సుధాకర్, అచ్చిని శ్రీనివాస్, కర్నాటి వెంకటేశం, యాదగిరి, శ్రీశైలం, ఖమ్మం రాములు, పెదగాని నరసింహ, రావుల నరసింహ, ఖమ్మం రాములమ్మ, ఎండీ రబ్బాని, విశ్వనాథం పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్‌ల పాలనతో ఇబ్బందులు

చిట్యాల: స్పెషల్ ఆఫీసర్ల పాలనలో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చిట్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆ పార్టీ నాయకులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ విజయకు వినతి పత్రం అందజేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, జిట్ట సరోజ, అర్రూరి శ్రీను, బొబ్బిలి సుధాకర్‌రెడ్డి, పంది నరేష్, ఐతరాజు యాదయ్య పాల్గొన్నారు.

నకిరేకల్ : ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నకిరేకల్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కందాల ప్రమీలా, మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, ఆకుల భాస్కర్, చిన్నబోయిన నాగమణి, వంటిపాక కృష్ణ, సాకుంట్ల నర్సింహ, కొప్పుల అంజయ్య, గింజల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలన్నింటిని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ జమీరుద్దీన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మక్క బుచ్చిరాములు, సిరుపంగి ఆంజనేయులు, కారింగుల వెంకన్న, ఎర్ర రమేశ్, దాసరి దేవచిత్తం, ఎల్లాంల వెంకటయ్య, వాడపల్లి శంకర్, బల్లెం వెంకటయ్య, లక్ష్మయ్య, లింగయ్య వెంకన్న, అన్నెబోయిన కిరణ్ పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం


కట్టంగూర్ పీఏసీఎస్‌లో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఏఓ శ్రావణ్‌కుమార్

కట్టంగూర్ : జిల్లాలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. సోమవారం కట్టంగూర్ పీఏసీఎస్ గోదాంలో ఉన్న యూరియా బస్తాల స్టాక్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాకు 70వేలు మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటికే 51వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, మరో 19వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తే సరిపోతుందని తెలిపారు. మంగళవారం జిల్లాకు 1300 టన్నులు యూరియా వస్తుందని తెలిపారు. ఆయన వెంట ఏఓ గిరిప్రసాద్, సీఈఓ మల్లారెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

విచారణలో వాగ్వాదం

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలిగా గతంలో పనిచేసిన మాధవిపై పలు అవినీతి ఆరోపణలు, ఫిర్యాదు వచ్చాయి. డీఈఓ భిక్షపతి ఆదేశాల మేరకు సోమవారం చిట్యాల ఎంఈఓ సైదానాయక్, జిల్లా అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ ఆఫీసర్ యోగేంద్రనాథ్ పాఠశాలలో విచారణ చేసేందుకు వచ్చారు. ఉపాధ్యాయురాలు మాధవిని పీఎం శ్రీ నిధుల ఖర్చు వివరాలతో పాటు ఇతర రికార్డులు ఇవ్వాలని విచారణకు వచ్చిన అధికారులు కోరారు. ఆమె రికార్డులు ఇవ్వకపోగా వాగ్వాదానికి దిగడంతో అధికారులకు ఆమెకు ఘర్షణ నెలకొంది. దీంతో జరిగిన సంఘటనపై విచారణకు వచ్చిన అధికారులు, మాజీ హెచ్‌ఎం పరస్పరం ఒకరిపై మరొకరు చిట్యాల పోలీస్‌స్టేషన్లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేసుకున్నారు.

శాంతియుతంగా నవరాత్రులు జరుపుకోవాలి : ఎస్పీ

నకిరేకల్ : గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతవరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. నకిరేకల్‌లోని 15వ వార్డులో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని సోమవారం ఆయన సందర్శించారు. మండప నిర్వాహకులతో మాట్లాడారు. పోలీసుల సూచనలు, సలహాలు పాటిస్తూ సహకరించాలని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన వేడుకలు జరుపుకోవాలన్నారు. ప్రజలకు వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐలు వెంకటేష్‌గౌడ్, కొండల్‌రెడ్డి, ఎస్ఐ లచ్చిరెడ్డి, యాసారుపు లక్ష్మీవెంకన్న ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చండూరు : గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చండూరులో సోమవారం 30 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చండూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్, ఫౌండేషన్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ వెంకన్న, సిబ్బంది రాధిక, శ్రీజన్, కృష్ణయ్య, యాదగిరి, విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

టీషర్టుల పంపిణీ

మర్రిగూడ: సీపీఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో కిరణ్ కళా బృందానికి సోమవారం టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి మేతరి యాదయ్య, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఇస్కిళ్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు

చండూరు : ఈ నెల రెండు, మూడో తేదీల్లో ఎస్జీఎఫ్ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ ఆటల పోటలకు అయ్యే ఖర్చును భరిస్తానని తెలిపిన కస్తాల గ్రామానికి చెందిన బొమ్మరబోయిన రమేష్‌ను ఎంఈఓ అభినందించారు.

ఆర్థిక సహాయం అందజేత

మునుగోడు: అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ పంచాయతీ వర్కర్ రావిరాల శ్రీను అంత్యక్రియల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆరేళ్ల సైదులు రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. అంతకు ముందు శ్రీను మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడెం గ్రామానికి చెందిన బల్లెం అబ్బయ్య–స్వరూప దంపతుల పెద్ద కుమారుడు బల్లెం ప్రణయ్ తలసేమియా వ్యాధికి గురై చికిత్స పొందుతూ శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బల్లెం అబ్బయ్య బాల్య మిత్రులు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుమార్తె బల్లెం ప్రవళిక పేరు మీద యూనియన్ బ్యాంకులో రూ.16వేలు డిపాజిట్ చేసి పత్రాలను అందించారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సతీష్ చంద్ర

నల్లగొండ టౌన్: ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ఇరిగేషన్ డివిజన్–6 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎం.సతీష్‌చంద్రయాదవ్ సోమవారం నల్లగొండలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సతీష్‌చంద్రయాదవ్‌కు సిబ్బంది జీ.విట్టలేశ్వర్, పి.పిచ్చయ్య, ఎం.శ్రీనివాస్‌లు స్వాగతం పలికారు.

పాఠశాలల్లో ప్రత్యేక పఠనం ప్రారంభం

నకిరేకల్ : విద్యార్థుల్లో పఠనాసక్తి, పఠన సంస్కృతిని పెంపొందించేందుకు రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 1 నుంచి 15 తేదీ వరకు అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో నిత్యం పఠన సంబంధిత కార్యక్రమాలను అరగంట కేటాయించనున్నారు. కార్యక్రమంలో భాగంగా పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం పఠనాసక్తి కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. పాఠ్య పుస్తకాలే కాకుండా కథల పుస్తకాలు ప్రతిరోజు ఆరగంట చదవాల్సి ఉంటుంది.

అన్నప్రసాద వితరణ

నకిరేకల్ : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్తా జయంతి సందర్భంగా నకిరేకల్‌లో వాసవి కపుల్స్ క్లబ్,వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే జయంతి వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు స్థానిక శివాలయంలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ప్రోగాం కోఆర్డినేటర్ దేవరశెట్టి సత్యనారాయణ, జోన్ చైర్మన్ గుండా నరేందర్, ఆయా క్లబ్‌ల అధ్యక్షులు కందగట్ల శ్వేత, శ్రీకాకుళ్ల వెంకన్న, ఉప్పల సంతోష్‌కుమార్, కొత్త అపర్ణ పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం

రామగిరి(నల్లగొండ): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామగిరి కనకదుర్గ వీధిలోని వినాయకుడి వద్ద సోమవారం ఉమా సమేత పార్థివ లింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. 49 సంవత్సరాల క్రితం నల్లగొండలోనే మొట్టమొదటిసారిగా నెలకొల్పిన వినాయకుడు నేటికి కొనసాగుతూ భక్తుల విశ్వాసాన్ని పొందుతున్నారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ సకినాల వెంకన్న, అశోక్ , కాకవరం రాజు, నాగరాజు, రవి, రమేష్, నాయిని ప్రసాద్, మాజీ కౌన్సిలర్ యామ కవితాదయాకర్, కుమారస్వామి, వెంకన్న, నరసింహ పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు


నల్లగొండ పట్టణంలోని రామకోటి స్తూప ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


నల్లగొండ పట్టణంలోని వల్లభరావు చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న యువకులు


కనగల్ : దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయ గణేశుడి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


నల్లగొండ పట్టణంలోని కనకదుర్గ ఆలయం వద్ద..